పార్కింగ్ లేక.. ప్రయాస తీరక

- పరిగిలో అధికమైన ట్రాఫిక్ సమస్య
- రోడ్లపైనే వాహనాల నిలిపివేత
- ఇబ్బందులు పడుతున్న పాదచారులు


రోడ్డు పక్కన వాహనాలు నిలపడంతో కొడంగల్ చౌరస్తాలో మళ్లడానికి తిప్పలు పడుతున్న లారీలు

పరిగి: అడ్డగోలుగా వాహనాలను రోడ్లపై నిలిపివేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. పరిగి పట్టణంలో పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు దినదినం తీవ్రమవుతున్నాయి. దీంతో వాహనదారులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. నియోజకవర్గంలోని ఆయా మండలాల ప్రజలు నిత్యం ఏదో ఒక పని నిమిత్తం పట్టణ కేంద్రానికి వస్తుంటారు. రోడ్లపైనే వాహనాలను ఇష్టానుసారంగా నిలపడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పరిగిలోని అన్ని ప్రధాన మార్కెట్ రోడ్లల్లో, జాతీయ రహదారిపై ఉదయం, సాయంత్రం పార్కింగ్ సమస్యలతో ప్రజలు, వాహనదారులు సతమతమవుతున్నారు. ఏళ్ల నుంచి ఇదే తంతు కొనసాగుతుండడం గమనార్హం. స్థానికంగా పార్కింగ్ స్థలం లేకపోవడంతో వాహనదారులు ఎక్కడ పడితే అక్కడే వాహనాలను నిలిపి తమ పనులను చేసుకుంటున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుందని పలువురు వాపోతున్నారు. ఎక్కువగా ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాల, కళాశాలల విద్యార్థులు రోడ్లపై ఉండటంతో పాదచారులు నడిచే స్థలాల్లో వాహనాలను నిలుపుతున్నారు. దీంతో చిన్నారులు రహదారులపై నడవాల్సిన పరిస్థితి నెలకొంది. ఫలితంగా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది.

రెండు కిలో మీటర్ల మేర

పట్టణ కేంద్రం నుంచే బీజాపూర్, హైదారాబాద్ జాతీయ రహదారి ఉండటంతో ఆర్టీసీ బస్టాండ్ నుంచి కొడంగల్ చౌరస్తా వరకు నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుంది. రోడ్డు పక్కకు వాహనాలను నిలపడంతో సమస్య మరింత తీవ్రరూపం దాల్చుతోంది. రోడ్డుపై వ్యాపారాలు నిర్వహించడంతో జనాలు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ దగ్గర ఎక్కువగా మొబైల్, ఇతర దుకాణాలు ఉండటంతో అందరు ఇక్కడికి వస్తుంటారు. అక్కడ పార్కింగ్ స్థలం లేకపోవడంతో రోడ్డు పక్కనే వాహనాలను నిలిపి పనులకు వెళ్లడంతో ట్రాఫిక్ జాం అవుతుంది. బహార్‌పేట్‌లో కూడా ఇదే తంతు మొదలవుతుంది. దాదాపు రెండు కిలోమీటర్ల మేర ఉదయం , సాయంత్రం స్థానికులు అవస్థలు పడుతున్నారు. రోడ్లపైన నిలిపిన వాహనాలపై పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. నో పార్కింగ్ బోర్డులను సైతం ఏర్పాటు చేయకపోవడంతో వాహనాలను ఎక్కడ పడితే అక్కడ నిలుపుతున్నారు.


బస్టాండ్ దగ్గర రోడ్డు పక్కన నిలిపిన వాహనాలు

రెండు రోజులు నరకమే!

ప్రతి శుక్ర, శని వారాల్లో పట్టణంలో రెండు రోజుల పాటు సంత జరుగుతుంది. నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి రైతులు, వ్యాపారస్తులు ఎంతో మంది వస్తుంటారు. ఆ సమయంలో రద్దీ తీవ్రంగా ఉంటుంది. సంత గంజ్‌రోడ్డులోనే జరగడంతో వారంలో ఆ రెండు రోజులు రోడ్లపై ప్రయాణించాలంటే నరకం చూడాల్సిందేనని వాహనదారులు వాపోతున్నారు. మార్కెట్‌లోకి వాహనాలు వెళ్లేందుకు రోడ్డు విస్తీర్ణం తక్కువగా ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తుంది. గంజి రోడ్డులో అన్ని రకాల వ్యాపారాలు అక్కడే ఉండటంతో వాహనాలను రోడ్డుపైనే నిలపడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంది. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామ సమీపంలో అతి పురాతన వీరభద్ర స్వామివారి దేవాలయ ప్రాంగణంలో సోమవారం శ్రీరేణుకాచార్య ఉద్భవన మహోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీరశైవ సమాజం నియోజకవర్గ అధ్యక్షుడు కొవురి విజయవర్ధన్ ఆధ్వర్యంలో రేణుకాచార్య స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మండపారాధన

మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామ సమీపంలో అతి పురాతన శ్రీర్యాలపేట వీరభద్ర స్వామివారి దేవాలయ ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా వీరభద్రస్వామి వారు, నంది, నాగదేవత, ధ్వజస్తంభం, శిఖర కలశం ప్రతిష్ఠాపన ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరిగాయి. మండపారాధన, దేవీ హోమం, విగ్రహాలకు జలాధివాసం, రుద్రహోమం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సోమవారం వీరభద్ర స్వామి, నంది, నాగదేవత, ధ్వజస్తంభం, శిఖర కలశ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు జరిపించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, వీరశైవ సమాజం నియోజకవర్గ అధ్యక్షుడు కోవురు విజయవర్ధన్, వీరశైవ సమాజం సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.


కార్యక్రమంలో వీరశైవ సమాజం సభ్యులు

విద్యార్థులకు 'ట్విన్నింగ్'పై అవగాహన


ఉన్నత పాఠశాలలో విద్యార్థులు

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల(పీఎంశ్రీ)కు చెందిన విద్యార్థులకు ట్విన్నింగ్ కార్యక్రమంపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఐదో తరగతి పూర్తయిన తర్వాత ఉన్నత పాఠశాలలో చేరితే ఏఏ సౌకర్యాలు ఉంటాయో హెచ్ఎం శ్రీహరిరెడ్డి విద్యార్థులకు వివరించారు. ఉన్నత పాఠశాలలో డిజిటల్ స్క్రీనింగ్ ల్యాబ్, తరగతి గదులు, ఉపాధ్యాయులు వినియోగిస్తున్న బోధన సామగ్రి, ఆటవస్తువులు వంటి వాటిని ఉపయోగించుకోవచ్చని చెప్పారు. ఐదో తరగతి పూర్తి కాగానే డ్రాపౌట్ కాకుండా ఉన్నత పాఠశాలలో చేరాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శానమ్మ, రేణుక, మొయినొద్దీన్, రమేశ్, వెంకటేశ్, చంద్రశేఖర్ తదితరులున్నారు.

క్లుప్తంగా

భారతి సిమెంట్ ఆధ్వర్యంలో భక్తులకు తాగునీరు


నీటి కేంద్రం వద్ద ఎమ్మెల్యే యాదయ్య, భారతి సిమెంట్ ప్రతినిధులు

నవాబుపేట: ఎల్లకొండ పార్వతీపరమేశ్వరుల జాతరలో భారతి సిమెంట్ ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం కల్పించారు. ఈ కేంద్రాన్ని ఎమ్మెల్యే కాలె యాదయ్య సోమవారం ప్రారంభించారు. నీటి సౌకర్యం కల్పించడంపై భారతి సిమెంట్ యాజమాన్యాన్ని ఎమ్మెల్యే ప్రశంసించారు. మూడు రోజులుగా మండలంలోని ఎల్లకొండలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో భారతి సిమెంట్ డీలర్ కె.గోపాల్, కంపెనీ ప్రతినిధులు నిరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దౌల్తాబాద్ ఏపీఓగా అంజిలయ్య



దౌల్తాబాద్: మండల ఉపాధి హామీ ఏపీఓగా అంజిలయ్య నియామకం అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఏపీఓ రజనీకాంత్ టీచర్‌గా ఎంపికయ్యారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాండూరు ఏపీఓగా పనిచేస్తున్న అంజిలయ్య దౌల్తాబాద్ మండల ఏపీఓగా సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలో ఉపాధి హామీ పథకం సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భారత్ విజయంపై సంబురాలు


జాతీయ జెండాలతో యువకుల కేరింతలు

ధారూరు: భారత క్రికెట్ జట్టు చాంపియన్ ట్రోఫీ కై వసం చేసుకోవడంతో వాడవాడలా సంబురాలు అంబరాన్నంటాయి. మండల పరిధిలో ఆదివారం రాత్రి చిన్నారులు, యువకులు విజయోత్సవాలు చేపట్టారు. బాణసంచా పేల్చి, స్వీట్లు పంచుకొని కేరింతలు కొట్టారు. డప్పుల ఊరేగింపు నిర్వహించి టీం ఇండియాకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజావాణిలో అర్జీలు శూన్యం

దౌల్తాబాద్: మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క దరఖాస్తు సైతం రాలేదు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో ఎవరికైనా సమస్యలు ఉంటే ఆయా శాఖల అధికారులకు దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. ప్రజావాణి కార్యక్రమానికి ఎంపీడీఓ శ్రీనివాస్, డీటీ చాంద్‌పాషా, ఏపీఓ అంజిలయ్య, టీఏ కృష్ణహరి, ఏఈ మహిపాల్ తదితరులున్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం ఇంటర్ రెండో సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు సెంటర్–ఏలో 251మంది విద్యార్థులకు గాను 247 మంది, సెంటర్–బిలో 304 మందికి అందరూ హాజరయ్యారని కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

గురుస్వామి మనోహర్ మృతి


మనోహర్ (ఫైల్)

అనంతగిరి: వికారాబాద్ పట్టణానికి చెందిన గురుస్వామి పురం మనోహర్(69) ఆదివారం రాత్రి మరణించారు. ఇంట్లో ఉండగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తుండగానే మృతిచెందారు. మనోహర్ ఇప్పటివరకు 36సార్లు అయ్యప్పమాలధారణ చేశారు. వికారాబాద్‌లోని అయ్యప్పస్వామి ఆలయ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించారు. ఆయన మృతి పట్ల వికారాబాద్ అయ్యప్ప సేవాసమితి ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి నివాళులర్పించారు. సోమవారం ధన్నారం శ్మశానవాటికలో అంత్యక్రియలు ముగిశాయి.

ఎంఈఎఫ్ కమిటీ ఎన్నిక

కందుకూరు: మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్(ఎంఈఎఫ్) కందుకూరు డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు సోమవారం ఎన్నుకున్న కమిటీని ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్ ప్రకటించారు. కమిటీ గౌరవ అధ్యక్షుడిగా యు.యశ్వంత్, అధ్యక్షుడిగా బి.యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా జె.కృష్ణ, కోశాధికారిగా జె.శ్రీను ఎన్నుకున్నారు.

డబుల్ రోడ్లను నిర్మించండి

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేసిన చౌడాపూర్ నేతలు

కుల్కచర్ల: చౌడాపూర్–లాల్‌పహాడ్ రహదారిని రెండు వరుసల బీటీ రోడ్డుగా నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం పరిగిలోని నివాసంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి చౌడాపూర్ మండల పరిధిలో అత్యవసరంగా ఉన్న బీటీ రోడ్ల నిర్మాణంపై చర్చించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. చౌడాపూర్ మండల పరిధిలో చౌడాపూర్–లాల్‌పహాడ్, ఈర్లవాగు తండా నుంచి జాకారం వరకు బీటీ రోడ్డు, మరికల్–మల్కాపూర్, మరికల్– వెంకట్‌రెడ్డిపల్లి రహదారులు ఇబ్బందికరంగా ఉన్నాయన్నారు. వాటికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, త్వరలోనే చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు రాము, నేతలు మాసయ్య, ఆంజనేయులు, రాంచంద్రయ్య, మణి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డిని కలిసిన కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ నాయకులు

కంకర రోడ్డు.. నిత్యం పాట్లు



ప్రభుత్వాలు మారినా పల్లె రోడ్ల దుస్థితి మాత్రం మారడం లేదు. ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు వేస్తున్నామన్న నేతలు మాటలు నీటి మీది రాతలుగా మారాయి. మండల పరిధిలోని దోర్నాల్‌పల్లి గ్రామం నుంచి దొంగ ఎన్కేపల్లి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. గతంలో కురిసిన అకాల వర్షాలతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి రహదారిపై కంకర తేలిన దుస్థితి నెలకొంది. అటుగా వెళ్లే ప్రయాణికులు ఆరేళ్లుగా రోడ్డుతో నానా అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని రోడ్డును మరమ్మతులు చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

– దోమ

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్: తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిట్టిఘనాపూర్ గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం పల్లెగూడ హనుమాన్ దేవాలయ సమీపంలో నిరుగుడి మల్లినాథ్ ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించిన శివుడి విగ్రహానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

బీరప్ప జాతరలో ప్రత్యేక పూజలు


జాతరలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్

ధారూరు: మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామంలో సోమవారం జరిగిన బీరప్ప జాతరలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాంప్రదాయ బద్ధంగా పురాతన కాలం నుంచి నిర్వహిస్తున్న ఈ జాతర కులమతాలకు అతీతంగా కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు వేణుగోపాల్ రెడ్డి, అంజయ్య పాల్గొన్నారు.

నీటి సరఫరా పునరుద్ధరిస్తాం

ఎంపీడీఓ విశ్వప్రసాద్

తాండూరు రూరల్: మండలంలో మేజర్ గ్రామ పంచాయతీ కరన్‌కోట్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తాండూరు ఎంపీడీఓ విశ్వప్రసాద్ అన్నారు. ఇటీవల ఎమ్మెల్యే మనోహర్ రెడ్డికి గ్రామస్తులు తాగు నీటి సమస్య నెలకొందని ఫిర్యాదు చేశారు. దీంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సోమవారం ఎంపీడీఓ విశ్వప్రసాద్ తన బృందంతో గ్రామంలో పర్యటించారు. గ్రామ సమీపంలో ఉన్న వాగు, బోరు మోటార్లు, ట్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. కరన్‌కోట్‌లో 11 వేల మంది జనాభా నివాసిస్తున్నారన్నారు. నిత్యం 8.40 లక్షల లీటర్ల నీటి డిమాండ్ ఉందన్నారు. మిషన్ భగీరథ సరఫరా నిలిచిపోతే గ్రామంలో తాగునీటి ఎద్దడి నెలకొందన్నారు. జీవన్గి సమీపంలో ఉన్న బోరు బావి నుంచి గ్రామంలోని బంగారమ్మగుడి వద్ద ఉన్న ట్యాంక్‌కు నీటి సరఫరా పునరుద్ధరిస్తామన్నారు. అవసరమైతే కొత్తగా బోరు తవ్వించి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌రావు, నాయకులు శరణుబసప్ప, రాజ్‌కుమార్, జర్నప్ప, సుధాకర్‌రెడ్ భరత్‌కిషోర్, శ్రీనుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


కరన్‌కోట్‌లో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ విశ్వప్రసాద్

విద్యార్థుల సామర్థ్యాలపై సర్వే


ధారూరులో సర్వే నిర్వహిస్తున్న సీఆర్‌పీ రాజశేఖర్, ఉపాధ్యాయులు

ధారూరు: మండలంలోని ఊరేంటతండా, ఎబ్బనూర్ మైలారం, ధారూరు గ్రామాల పాఠశాలల్లో సోమవారం రాష్ట్రస్థాయి మౌలిక భాష, గణిత సామర్థ్యాల సాధన ఫైనల్ శ్యాంపుల్ సర్వేను నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో రెండో తరగతి విద్యార్థుల్లో ఆంగ్లం, గణితం, తెలుగులలో సామర్థ్యాలను పరిశీలించే కార్యక్రమంలో భాగంగా సర్వే చేపట్టారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రామ్‌మస్తాన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సర్వే ఈనెల 12 వరకు కొనసాగనుంది. సమాచారాన్ని సేకరించి సంబంధిత యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

బంట్వారం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవా రం మండల కేంద్రంలోని మానవ వనరుల కేంద్రంలో ఉపాధ్యాయినులను ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు ఘనంగా సన్మానించారు. శాలువా పూలమాలలతో సత్కరించి మహిళల గొప్పతనాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సన్మానం అందుకున్న గురువులు

టెం'డర్'

- జేపీదర్గా హుండీ టెండర్లకు ఆసక్తి చూపని వ్యాపారులు
- భారీగా పెంచడంతో దూరం

కొత్తూరు: గతంలో జేపీ దర్గా హుండీ టెండర్లను దక్కించుకోవడానికి స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల వ్యాపారులు పెద్దఎత్తున ఆసక్తి చూపేవారు. వక్ఫ్‌బోర్డు అధికారులు టెండర్ల నిర్వహణ కోసం నోటిఫికేషన్ జారీ చేసిన వెంటనే పదుల సంఖ్యలో వ్యాపారులు బిడ్డింగ్‌లో పాల్గొని టెండర్‌ను దక్కించుకునేవారు. కానీ ఈ ఏడాది అధికారులు నోటిఫికేషన్ జారీ చేసినా వ్యాపారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. గతేడాది హుండీ టెండర్లు సుమారు రూ.2కోట్లకు వ్యాపారులు దక్కించుకున్నారు. ఈ ఏడాది వక్ఫ్‌బోర్డు అంచనాలకు మించి హుండీ టెండర్‌ను రూ.4కోట్లకు నిర్ధారించి నోటిఫికేషన్ జారీ చేసింది. అధికారులు ఒక్కసారిగా టెండర్ ధరను పెంచడంతో వేలంలో ఒక్కరూ కూడా పాల్గొనలేదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో వక్ఫ్‌బోర్డు అధికారులు ఈ నెల 7న కొనసాగాల్సిన వేలాన్ని రద్దుచేశారు.

భక్తులకు తప్పని ఇబ్బందులు

ఇప్పటికే దర్గా దర్శనం కోసం వచ్చే భక్తుల పట్ల వ్యాపారులు హుండీలో కానుకలు వేయాలని బలవంతం చేస్తూ దాడులకు పాల్పడుతున్నారు. వ్యాపారుల దౌర్జన్యాలు, దాడులపై పలువురు భక్తులు పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఒక్కసారిగా వక్ఫ్‌బోర్డు అధికారులు రూ.4 కోట్లకు టెండర్లను పెంచడంతో స్థానిక వ్యాపారులతో పాటు భక్తులు వారి తీరును వ్యతిరేకిస్తున్నారు. ఇంత పెద్ద మొత్తంలో టెండర్లు తీసుకుంటే భక్తులకు ఇబ్బందులు తప్పవని పేర్కొంటున్నారు.


జేపీ దర్గా

సావిత్రిబాయి పూలే ఆదర్శనీయం

తాండూరు టౌన్: సావిత్రిబాయి పూలే మహిళా శక్తికి నిలువెత్తు నిదర్శనమని బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు కందుకూరి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆమె వర్ధంతిని పురస్కరించుకుని బీసీ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే తపనతో సొంత డబ్బులతో బాలికా పాఠశాలలను ఏర్పాటు చేసిన మహనీయురాలని కొనియాడారు. విద్యతోనే అన్నీ సాధ్యమని నమ్మి అనేక ఆటుపోట్లను ఎదుర్కొని బాలికా విద్యను ప్రారంభించిందన్నారు. అతివల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసిన సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు సయ్యద్ షుకూర్, వెంకటేష్, అనిత, మంజుల, లక్ష్మీనరసమ్మ, శివలీల, వీరమణి, జగదీశ్వరి, పరమేష్, బాబాగౌడ్, పాండు, రమేష్, ఆనంద్, నవీన్, వెంకట్, బస్వరాజ్, అరుణ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.


తాండూరు టౌన్: సావిత్రిబాయి వర్ధంతి కార్యక్రమంలో నాయకులు

పూలే సేవలు ఎనలేనివి

అనంతగిరి: విద్యకు నోచుకోక వివక్షకు గురవుతున్న సమాజంలో దేశంలో మొట్టమొదటి మహిళా పాఠశాలను నెలకొల్పి మహిళలకు అక్షరాలు నేర్పించిన సావిత్రిబాయి పూలే సేవలు ఎనలేనివని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఎస్.శుభప్రద్ పటేల్ అన్నారు. ఈ మేరకు సోమవారం వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం(వీడీడీఎఫ్) ఆధ్వర్యంలో వికాస్ జూనియర్ కళాశాల ఆవరణలో సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించారు. ముందుగా సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ.. పూలే దంపతులు సమాజంలో అంటరానితనం, అస్పృశ్యత, సతీసహగమనం లాంటి సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి కృషి చేశారని పేర్కొన్నారు. పూలే దంపతుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రతినిధులు మారుతి, దేవదాస్, మానిక్‌రెడ్డి, దేవదాస్, తిరుపతిరెడ్డి, దత్తు, సుజిత్, సురేష్, సిద్దికి, అఖిల్ పాల్గొన్నారు.


అనంతగిరి: సావిత్రిబాయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వీడీడీఎఫ్ నాయకులు